క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని మొయినాబాద్, సురంగల్, అమ్డాపూర్ రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం కరెంటు సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ హము నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మొయినాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని విజయ్‌నవ్య ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, సురంగల్ ఫీడర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ అంతరాయానికి ఆయా ప్రాంతాల వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న అధికారి

షాద్‌నగర్: ఇటీవల వడగళ్లు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో పెద్ద ఎత్తున వరి, మామిడి, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. శనివారం మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో పర్యటించి వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. బూర్గులలో 14 మంది రైతులకు చెందిన 16.20 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు దెబ్బతిన్నట్లు ఏఈఓ తెలిపారు. బాధితుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు వివరించారు.

పుస్తకాల అందజేత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

కేశంపేట: విద్యార్థులు స్వామి వివేకనందుడి చరిత్రను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెదురువెల్లి భాస్కర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో శనివారం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను భాస్కర్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత, విద్యార్థులు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు. స్వామి వివేకానంద జీవిత చరిత్రను చదివి ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్, ఉపాధ్యాయులు కరుణాకర్‌గౌడ్, కృష్ణారెడ్డి, లత, భూదేవి, గంగమ్మ, సుమలత, విజయ్‌కుమార్, నవనీత, రజిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



అజీజ్‌నగర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యులు

మొయినాబాద్: పాడి పశువులకు రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని 246 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా, గోపాల మిత్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కొందుర్గు: బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింలు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 17న విద్యుత్ ప్రమాదంతో మృతిచెందిన అశోక్ రెడ్డి కుటుంబ సభ్యులను సంఘ్ సభ్యులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింలు గౌడ్ మాట్లాడుతూ.. గాలి వానతో మూడు రోజుల క్రితం కరెంట్ స్తంభం విరిగిపోయి తీగలు తెగి పడినా లైన్‌మెన్, ఏఈలైన్ మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. అశోక్‌రెడ్డి కుటుంబానికి న్యాయం చేసే వరకు సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, సత్యనారాయణరెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడరు.. నిర్మాణం పూర్తి చేయరు

ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు పడింది. నిధుల లేమి, అధికారుల సమన్వయలోపం వెరసి స్థానికులకు నీటి సౌకర్యాన్ని మరింత దూరం చేస్తున్నాయి. కొత్తూరు మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ఈ సమస్య వేధిస్తోంది.

- నిరుపయోగంగా తాగునీటి ట్యాంకులు
- నిధుల లేమితో నిలిచిన పనులు



పెద్దగుట్టతండాలో అసంపూర్తిగా ఓవర్‌హెడ్ ట్యాంకు



జేపీదర్గా ఆవరణలో వాడుకలో లేని ట్యాంకు

కొత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో కొన్నేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి ప్రారంభించిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పలుచోట్ల నిధుల లేమి, మరికొన్ని చోట్ల అధికారుల మధ్యన సమన్వయలోపం.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో ప్రారంభానికి ముందే ట్యాంకులు శిథిలమవుతున్నాయి. అంతేకాకుండా కొన్ని ఊర్లల్లో నాణ్యత లోపించడంతో లీకేజీ అవుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు తాగేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొవాల్సిన దుస్థితి దాపురించింది.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు!

మండలంలోని మల్లుగూడ పంచాయతీ పెద్దగుట్ట తండాలో కొన్నేళ్ల క్రితం సుమారు రూ.6 లక్షలు వెచ్చించి తాగునీటి ట్యాంకు పనులను ప్రారంభించారు. తీరా నిధుల లేమి కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ట్యాంకు తండాలో దిష్టి బొమ్మలా మారిందని స్థానికులు వాపోతున్నారు. జేపీదర్గా ఆవరణలో గతంలో అప్పటి జిల్లా ఎంపీ నిధుల కింద సుమారు రూ.5 లక్షలతో భక్తుల సౌకర్యార్థం ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. పనులు పూర్తయిన తర్వాత ట్రయల్‌రన్ చేయగా ట్యాంకు నుంచి నీరు చాలా చోట్ల లీకేజీ రూపంలో బయటకు వచ్చింది. అవాక్కైన అధికారులు కాంట్రాక్టర్‌తో చర్చించి మరమ్మతులు చేయిస్తామని ప్రకటించారు. కానీ నేటికి పనులు చేయించకపోవడంతో ట్యాంకు నిరుపయోగంగా మారింది.

చొరవ చూపని అధికారులు

ట్యాంకులు వృథాగా మారినా.. మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా... పనులు మధ్యలో నిలిచిన వాటిని పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో వాటి నిర్మాణం కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్న రూ.లక్షల నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో నిర్మాణంలో ఉన్న ట్యాంకులను గుర్తించి, వాటికి నిధులు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కొత్తూరు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

కొత్తూరు: ఆదర్శ మున్సిపాలిటీగా కొత్తూరును అభివృద్ధి చేయడానికి బృహత్తర ప్రణాళిక తయారు చేసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాలకవర్గ సభ్యులకు సూచించారు. మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బడ్జెట్, సాధారణ సమావేశంలోఆయన, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశంలో భాగంగా సభ్యులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.9.43 కోట్లు, ప్రభుత్వ నిధులు రూ.31.98 కోట్లు మొత్తం 40.41 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఈ నిధులతో ఆయా వార్డుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయనున్నట్లు పాలకవర్గం ప్రకటించారు. కొత్తూరు మున్సిపాలిటీను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గతంలో మున్సిపాలిటీలకు విడుదల కానీ నిధులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి

మున్సిపాలిటీలో చేపట్టే పనులకు అధికారులు తప్పకుండా సహకరించాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీలో అధికారులు, కౌన్సిలర్లు తమ దృష్టికి తెస్తున్న సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. గత బడ్జెట్ సమావేశంలో జరిగిన తీర్మానాలు, చేసిన పనులకు సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, పాలకవర్గం సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని 8వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇసుక వ్యాపారులకు పట్టణంలో ప్రత్యేక స్థలం కేటాయించే విధంగా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, బస్వం, ఇబ్రహీం, మోహన్, అప్పి, శేఖర్, జయప్రకాష్, శ్రీశైలం, కృష్ణవేణి, నాగమణి, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో ఘనంగా పల్లకీ సేవ

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్యులు, కృష్ణ, ప్రమోద్‌లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి పల్లకీ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. అనంతరం అచ్చంపేట ఎంపీడీఓ పాలకొండ మధుసూధన్‌గౌడ్, హైమావతి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, భక్తులు నితీష్‌గౌడ్, కీర్తిగౌడ్, శ్రీకాంత్, వెంకటేష్‌గౌడ్, జనార్దన్, సుదర్శన్, సురేందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రఘుగౌడ్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

భూ బాధితులకు పరిహారం పెంచండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం పెంచి ఇవ్వాలని చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఖానాపూర్ గేట్ వద్ద ఉన్న ఇంద్రారెడ్డినగర్‌లో దాదాపు 20 మందికిపైగా ఇళ్లు రోడ్డు విస్తరణలో కోల్పోతున్నారని చెప్పారు. వారికి ప్రస్తుత మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం ఇవ్వడంతోపాటు ప్రభుత్వం ప్లాట్లు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని కోరారు. నియోజకవర్గానికి మంజూరైన తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను చేవెళ్ల మండల కేంద్రంలో నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు బి.అరుణ్ కుమార్ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరి విష్ణువర్ధన్ అన్నారు. గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి దేవాలయాన్ని శుభ్రం చేశారు. రేషన్ దుకాణం, ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలను పరిశీలించారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తుందన్నారు. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు సుధాకర్‌రావు, రంగన్నగౌడ్, బాల్‌రెడ్డి, శివకుమార్, రమేష్, బాల్‌రాజ్, మల్లేష్, ప్రభు, రాజు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



వీరన్నపేటలో స్థానికులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దైవాలగూడ గ్రామస్తులు భీంభరత్‌ను కలిసి తమ గ్రామానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దైవాలగూడ గ్రామంలో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మండల ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు జంగయ్య, భాస్కర్, విజయ్, యాదయ్య, నర్సింహులు, బాలయ్య, మురళి, శ్రీనివాస్, శివయ్య, రాఘవేందర్ పాల్గొన్నారు.



భీంభరత్‌తో దైవాలగూడ గ్రామస్తులు

లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలి

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్



మొయినాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు అధికారులు, ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 542 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా వచ్చిందన్నారు. ఇందులో హిమాయత్‌నగర్–151, మొయినాబాద్–90, అజీజ్‌నగర్–21, చిలుకూరు–124, పెద్దమంగళారం–57, సురంగల్–7, ముర్తూజగూడ–1, ఎనికేపల్లి–91 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వార్డు, ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి పరిశీలించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరవుతాయన్నారు. సమావేశంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలు తప్పనిసరి

కేశంపేట: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్వాల గ్రామంలోని రైతువేదికలో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి పంచాయతీ కార్యదర్శులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... మండలంలోని వివిధ గ్రామాలకు మొదటి విడతలో 745 ఇళ్లు మంజూరు అయ్యారన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హులను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, ఎంఈఓ చంద్రశేఖర్, నాయబ్ తహసీల్దార్ గీత, ఏఈ(ఇరిగేషన్) గీత, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాలశ్రావణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో సమావేశం

శంకర్‌పల్లి: ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మండలంలో అర్హులను గుర్తించాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కమిటీలతో చర్చించి, ఫైనల్ లిస్టును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, అవసరమైన చోట్ల మరమ్మతులు చేయించాలని సూచించారు.


రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న నిర్వాహకులు

షాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి రక్తపు బొట్టు ఓ మనిషి ప్రాణాన్ని కాపాడుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో చేవెళ్ల స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తలసేమియా వ్యాధిగ్రస్తులు కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ చందానగర్, రాంచంద్రపురం అధ్యక్షుడు సుభాష్ కర్కేర, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షులు హర్షసాయి, లక్ష్మి నారాయణ, మోహన్, రంజిత్‌రెడ్డి తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 46 మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీహరి, జాని, బి.శ్రీకాంత్, గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు ఆర్థికసాయం



అర్చకులకు నగదును అందజేస్తున్న బాల్‌రెడ్డి

నందిగామ: మండల కేంద్రంలో శ్రీ శివరామాంజనేయ స్వామి దేవాలయంలోని అర్చకులకు అదే గ్రామానికి చెందిన జిల్లెల్ల బాల్‌రెడ్డి శనివారం రూ.40 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాలయంలో నిత్యం పూజలు, దూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్న అర్చకులకు నెల వారీగా వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయం తెలిసి తనకు తోచిన ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్ రెడ్డి, రాంరెడ్డి, కొమ్ము కృష్ణ, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి

షాబాద్: గొల్లూరుగూడకు చెందిన యాస పర్మారెడ్డి గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి పర్మారెడ్డి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు మల్లేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరండి



మొయినాబాద్‌రూరల్: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



చేవెళ్ల: ఆలూరులో..

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి

మొయినాబాద్‌రూరల్: వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో శనివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. గ్రామాల నుంచి రైతులు, ప్రజలను తరలించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుధాకర్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రవి యాదవ్, అంజయ్యగౌడ్, విష్ణుగౌడ్, పరమేష్, ప్రవీణ్, జగన్ తదితరులు ఉన్నారు.

ఆలూరులో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కోరారు. మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కసిరే వెంకటేశ్, గ్రామ అధ్యక్షుడు షాబాద్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులతో కలిసి రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఫయూమ్, శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్, పృథ్వీరాజ్, బాబు, నగేశ్, నర్సింలు, ఖదీర్, అమర్, బాల్‌రాజ్, నర్సింలు, హన్మంత్, వెంకటేశ్, గోపాల్, ప్రవీణ్, రాజు తదితరులు ఉన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

నందిగామ: తల్లిపాలే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి అన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం సల్వేంద్రిగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీబాయి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నాట్కో ట్రస్టు ప్రతినిధి సూర్యనారాయణ, గ్రామ కార్యదర్శి వెంకటేష్, ఏఎన్ఎం రేణుక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.